శ్రీరస్తు    శుభమస్తు

శ్రీ శంకరాచార్య విరచిత

# గోవిందాష్టకమ్ - భావార్థముతో -



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

# గోవిందాష్టకమ్ - భావార్థముతో.

01. సత్యం జ్ఞానమనన్తం నిత్యమనాకాశం పరమాకాశం
గోష్ఠప్రాంగణరింఖణలోలమనాయాసం పరమాయాసమ్।
మాయాకల్పితనానాకారమనాకారం భువనాకారం
క్ష్మామానాథమనాథం ప్రణమత గోవిందం పరమానందమ్॥

సత్యస్వరూపి, జ్ఞానాకారుడు, అంతములేనివాడు, నిత్యుడు, అంతటావ్యాపించినవాడు పరమాకాశస్వరూపుడు - గోశాలలప్రాంగణములలో ఆడుకొనుటయందు కోరిక కలవాడు, ఆయాసము నెరుగనివాడు, అతికష్టంతో తెలుసుకొనదగినవాడు - మాయతో నానారూపములను ధరించినవాడు, నిర్దిష్టమైన ఆకారము లేనివాడు, లోకములే ఆకారముగా కలవాడు - భూదేవికి, శ్రీదేవికి నాథుడు, తనకంటే గొప్పవాడెవడూ లేనివాడు అగు పరమానంద స్వరూపుడైన గోవిందునికి నమస్కరించుము.

- - - - - -

02. మృత్స్నామత్సీహేతియశోదాతాడనశైశవ సంత్రాసం
వ్యాదితవక్త్రాలోకితలోకా లోక చతుర్దశ లోకాళిమ్।
లోకత్రయపుర మూలస్తంభం లోకాలోకమనాలోకం
లోకేశం పరమేశం ప్రణమత గోవిందం పరమానందమ్॥

ఇక్కడ మన్ను తింటున్నావా! అని యశోద కొట్టుచున్నట్టుగా బాల్యంలో బెదిరించగా పర్వతము వరకు ఉన్న పద్నాలుగు లోకములను చూపించినవాడు - ముల్లోకములనే పురమునకు మూలస్తంభమైనవాడు లోకముల నన్నిటినీ చూచువాడు - చూడశక్యము కానివాడు, లోకేశుడు, పరమేశుడు, పరమానంద స్వరూపుడు అగు గోవిందునికి నమస్కరించుము.

- - - - - -

03. త్రైవిష్టపరిపువీరఘ్నం క్షితిభారఘ్నం భవరోగఘ్నం
కైవల్యం నవనీతాహారమనాహారం భువనాహారం।
వైమల్యస్ఫుటచేతోవృత్తివిశేషాభా సమనాభాసం
శైవం కేవలశాంతం ప్రణమత గోవిందం పరమానందమ్॥

దేవశత్రువులైన రాక్షస వీరులను చంపువాడు, భూ భారమును పోగొట్టువాడు, సంసారమనే రోగమును నశింపచేయువాడు - కైవల్యరూపుడు, వెన్న తినువాడు, ఏ ఆహారము తిననివాడు, ప్రళయకాలంలో ప్రపంచమును హరించువాడు - నిర్మలమైన మనస్సుకు కనబడువాడు, అదృశ్యరూపుడు, శుభకరుడు, కేవలాంతాకారుడు, పరమానందస్వరూపుడు అగు గోవిందునికి నమస్కరించుము.

\- - - - - -

04. గోపాలం భూ(ప్రభు)లీలావిగ్రహగోపాలం కులగోపాలం
గోపీఖేలన గోవర్ధనధృతి లీలా లాలిత గోపాలమ్।
గోభిర్నిగదితగోవిందస్ఫుటనామానంబహునామానం
గోధీగోచరదూరం ప్రణమత గోవిందం పరమానందమ్॥

గోలోకమును పాలించువాడు, భూమిపై లీలలు చేయుటకై గోపాలునిగా అవతరించినవాడు, గొల్లవారి ఇంటిలో పుట్టినవాడు - గోపికలతో ఆడుట మరియు గోవర్ధనము నెత్తుట మొదలైన లీలలతో గోపాలకుల నందరినీ ఆనందింప చేసినవాడు - గోవులచేత కూడ స్పష్టంగా 'గోవిందా' అని పిలువబడువాడు, ఇంద్రియములకు మరియు బుద్ధికి అందనివాడు పరమానంద స్వరూపుడు అగు గోవిందునికి నమస్క రించుము.

\- - - - - -

05. గోపీమండల గోష్ఠీభేదం భేదావస్థ మభేదాభం
శశ్వద్గోఖుర నిర్ధూతోద్గత ధూళీధూసర సౌభాగ్యమ్।

శ్రద్ధాభక్తిగృహీతానందమచింత్యం చింతితసద్భావం
చితామణిమహిమానం ప్రణమత గోవిందం పరమానందమ్॥

గోపికలను మండలాకారముగా నిలిపి అనేక రూపములతో విడివిడిగా క్రీడించువాడు – భిన్న అవస్థలలో ఉండికూడా భేదము లేని వాడు, ఆవు గిట్టల తాకిడిచే పైకెగసిన ధూళితో ఆవరింపబడిన సౌందర్యం కలవాడు – శ్రద్ధాభక్తులతో గ్రహించబడువాడు, ఊహకందనివాడు ధ్యానించువారిపై సద్భావన కలవాడు, చింతామణి వలే కోరిన దెల్ల తీర్చు మహిమ కలవాడు, పరమానంద స్వరూపుడు అగు గోవిందునికి నమస్కరించుము.

– – – – – –

06. స్నానవ్యాకులయోషిద్వస్త్రముపాదాయాగముపారూఢం
వ్యాదిత్సన్తీరథ దిగ్వస్త్రా దాతుముపాకర్షన్తం తాః।
నిర్ధూతద్వయశోకవిమోహం బుద్ధం బుద్ధేరన్తస్స్థం
సత్తామాత్రశరీరం ప్రణమత గోవిందం పరమానందమ్॥

స్నానం చేయు స్త్రీల వస్త్రములను తీసుకొని చెట్టు నెక్కినవాడు, తన మాట అంగీకరించి దిగంబరులైన స్త్రీలకు వస్త్రములందించుచూ తన వద్దకు ఆకర్షించు వాడు – శోకమోహముల రెండింటినీ విడచినవాడు, బుద్ధిమంతుడు, భక్తుల బుద్ధిలో ఉన్నవాడు, సత్‌స్వరూపుడు, పరమానంద రూపుడు అగు గోవిందుని నమస్కరింపుము.

– – – – – –

07. కాన్తం కారణకారణమాదిమనాదిం కాలఘనా భాసం
కాళిందీగతకాళియశిరసి సునృత్యంన్తం ముహురత్యన్తమ్।
కాలం కాలకలాతీతం కలితాశేషం కలిదోషఘ్నం
కాలత్రయగతిహేతుం ప్రణమత గోవిందం పరమానందమ్॥

మనోహరుడు, కారణములకే కారణమైనవాడు, అనాదియైనవాడు, కాలమేఘము వలే నల్లనివాడు, కాళిందీనదిలోని కాళీయుని శిరస్సుపై ఎక్కువగా మంచి నృత్యము

చేయువాడు, కాలస్వరూపుడు - కాలవిభాగములకు అతీతుడు, అంతటా వ్యాపించిన వాడు, కలిదోషములను నాశనంచేయువాడు, మూడుకాలములు నడుచుటకు కారణమైన వాడు, పరమానంద స్వరూపుడు అగు గోవిందునికి నమస్కరింపుము.

\- - - - - -

08. బృందావనభువి బృందారకగణబృందారాధితవంద్యాయాం
కుందాభామలమందస్మేరసుధానందం సుమహానందమ్।
వంద్యాశేషమహామునిమానసవంద్యానంద పదద్వం(ద్వ)దం
నంద్యాశేషగుణాబ్ధిం ప్రణమత గోవిందం పరమానందమ్॥

దేవతలు కూడ ఆరాధించు బృందావనభూమిలో మొల్లపూలవంటి నిర్మల దరహాసముతో అమృతానందము కలవాడు, మహానంద స్వరూపుడు - అందరిచే నమస్కరించబడు మహామునుల మనస్సులో ప్రణమిల్లబడు ఆనందకరమైన రెండు పాదములు కలవాడు, అందరినీ ఆనందపరచు అశేషగుణములకు సముద్రము వంటివాడు పరమానంద స్వరూపుడు అగు గోవిందునికి నమస్కరింపుము

\- - - - - -

09. గోవిందాష్టకమేతదధీతే గోవిందార్పితచేతాయో।
గోవిందాచ్యుత మాధవ విష్ణో గోకులనాయక కృష్ణేతి।
గోవిందాంఘ్రిసరోజధ్యానసుధాజలదౌతసమస్తాఘో
గోవిందం పరమానందామృతమంతఃస్థం స తమభ్యేతి॥

గోవిందుని యందు మనస్సు నర్పించి గోవిందాష్టకమును చదువువాడు గోవిందా! అచ్యుతా! మాధవా! విష్ణూ! గోకులనాయకా! కృష్ణా! అని జపించుచూ గోవిందుని పాద పద్మముల ధ్యానమనే అమృత సముద్రముచే సమస్త పాపములు ప్రక్షాళింపబడినవాడై తనలో ఉన్న పరమానందామృత రూపమైన గోవిందుని చేరును.

\- - - - - -

**ఇతి శంకరాచార్యకృత గోవిందాష్టకం సంపూర్ణం**

\- - - = - - -

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్


Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్






Kiron Type Institute